క్లుప్తంగా

సీఎం ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : 14న హాలియాలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొమ్మరబోయిన నాగార్జున, చల్లా కోటేశ్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నోముల శంకర్, రామాంజిరెడ్డి, మారుపాక కాశి, గోపి, రాంబాబు, సైదులు, భాస్కర్, వనమాలు, అబ్బయ్య, మల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అడవిదేవులపల్లి : ఎన్నికల్లో భాగంగా శనివారం ఓటర్లకు అడవిదేవులపల్లి, కొత్త నందికొండ, మొల్కచర్ల గ్రామాల్లో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రమేశ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో సంబంధిత వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అంజి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నాగార్జునసాగర్ : భారత తొలి విద్యాశాఖ మాత్యులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆజాద్ విద్యాశాఖమంత్రిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ సంపత్‌తో పాటు మైనార్టీనాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ ఆనంద్‌కు సన్మానం



ప్రశంసపత్రం అందుకుంటున్న డాక్టర్ ఆనంద్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ ఇస్లావ్ ఆనంద్‌కు మార్‌కు శనివారం ఢిల్లీలో ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసపత్రం అందజేసి సన్మానించారు. పేద ప్రజలకు ఆయుర్వేద వైద్యంతో అందిస్తున్న సేవలను గుర్తించి ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్, అడిషనల్ కమిషనర్ ఆయూష్ ప్రదీప్‌లు ఆయనను సత్కరించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి ప్రశంస పత్రం అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏడుసార్లు గెలిపిస్తే జనారెడ్డి చేసిందేమీ లేదు

మాడుగులపల్లి : నాగార్జున సాగర్ ప్రజలు ఏడుసార్లు జానారెడ్డిని గెలిపిస్తే పదవులు అనుభవించాడే తప్పా ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని బీజేపీ నాగార్జున సాగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి అన్నారు. మండలంలోని గార్లకుంటపాలెం, కన్నెకల్లు, ధర్మపురం, మాచినపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్ యాదవ్, మండలాధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నర్సింహ గౌడ్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నాంపల్లి : మండల కేంద్రంలోని మహేష్ బెల్ట్ దుకాణంలో 6లీటర్ల మద్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నజీర్

మర్రిగూడ: మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ నజీర్‌ను నియమిస్తూ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి శనివారం హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ఎ.సలీం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సరిపంగి శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో..దోమలు

- ఖాళీ స్థలాలు, మురుగు కాల్వల్లో వృద్ధి చెందుతున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నియంత్రణకు ఫాగింగ్ చేపట్టాలని వేడుకోలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణ వాసులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వాటి విజృంభణతో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రస్తుతం మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో జనావాసాలు, డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలతో నీరు నిలుస్తోంది. ఇందులో దోమలు గుడ్లు పెట్టి తమ సంతానాన్ని వృద్ధి చేసుకొని ప్రజలపై విజృంభిస్తున్నాయి. నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఎదుర్కొంటోంది.

ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు

మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా చూసినా చెత్తకుప్పలే దర్శనం ఇస్తున్నాయి. తడి, పొడి చెత్తల నిల్వలు ఎక్కడపడితే అక్కడ ఉండటంతో పాటు కుళ్లిన ఆహార పదార్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటం, అందులోనే వివిధ రకాల వ్యర్థాలను వేయడంతో కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీని వలన పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు అవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వీటి వలన విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు ఊదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.



మిర్యాలగూడలోని నందిపాడులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



మిర్యాలగూడలోని ఎల్‌ఐసీ వెనుక భాగంలో మురుగు కాల్వ ఇలా..

ఇబ్బందులు ఇలా..

- మున్సిపాలిటీ పరిధిలో దోమలు విజృంభిస్తున్నాయి.
- దోమల బెడదతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.
- దోమల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు, వర్షపునీరు వచ్చి చేరుతుంది.
- నీటి నిల్వల్లో దోమలు గుడ్లు పెడుతుండడంతో వృద్ధి చెందుతున్నాయి.
- మున్సిపాలిటీలో మాత్రం దోమలు, ఈగలు మాత్రం నియంత్రణలోకి రావడం లేదు.

దోమలు మరింత పెరిగాయి



దోమలు మరింత పెరిగిపోయాయి. ఇళ్లలో పట్టపగలే తిరుగుతున్నాయి. ఫ్యాన్లు వేసినా దోమలు నియంత్రణ కావడం లేదు. జ్వరాలు సోకుతున్నాయి. మున్సిపాలిటీ వారు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలి.
– జి.శ్రీకాంత్, మిర్యాలగూడ

ఫాగింగ్ చేయాలి



వర్షాకాలంలో మరింత పెరుగుతున్న దోమల ఉధృతిని తగ్గించేందుకు అధికారులు సిబ్బందితో ఫాగింగ్ చేయించాలి. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
– మహ్మద్ జలాల్ అహ్మద్, హనుమాన్‌పేట

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీలో మురుగునీటి నిల్వలను తొలగించడంతో పాటు దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. నీటి నిల్వల వద్ద అయిల్ బాల్స్‌ను వేయిస్తున్నాం. ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
– పూర్ణచందర్, కమిషనర్, మిర్యాలగూడ

పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి

- మిర్యాలగూడ బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు



బీఆర్‌ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావును గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

మిర్యాలగూడ : సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేదల అభ్యున్నతి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని సుందర్‌నగర్, రంగ్రేజ్‌బజార్, మెయిన్‌బజార్, రంగన్నకాలనీ, ముత్తిరెడ్డికుంట, వినోభానగర్, అశోక్‌నగర్, రెడ్డి కాలనీ, బాపూజీనగర్, వడ్డెరగూడెం, గాయత్రినగర్, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు సంజాతనవాబ్, ఇలియాస్, ఎండీ.సాదేఖాబేగంఖాదర్, బల్లెం దేవకమ్మ అయోధ్య, నాయకులు దుర్గారావు, అశోక్, సుబ్బారావు, కోటేశ్వర్‌రావు, అంజన్‌రాజు, పండుగ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ తన గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వేములపల్లి మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి ప్రజలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామరెడ్డి కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, బీఆర్‌ఎస్ యువ నాయకులు నల్లమోతు చైతన్య, సిద్ధార్థ, నాయకులు మల్లయ్య యాదవ్, పేరాల కృపాకర్‌రావు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి కంటి చూపు



ఐ రెట్రీవల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాశెట్టి శ్రీనివాస్, కర్నాటి రమేష్

మిర్యాలగూడ : నేత్రదానంతో మరొకరికి కంటి చూపు వస్తుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినేడ్ సెక్రటరీ మాశెట్టి శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని ఐ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఏర్పాటు చేసిన డైమండ్ నేత్ర బ్యాంక్ సమాచార కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడలో నేత్రదానం చేసే వారికి సౌకర్యార్థంగా ఐ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా నేత్ర సమాచార కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మిర్యాలగూడలో మరణాంతరం సుమారు 45మంది నుంచి నేత్రాలను సేకరించామన్నారు. నేత్రదానం చేసే వారి సమాచారాన్ని కేంద్రానికి తెలియచేస్తే వెంటనే హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రికి తెలిపితే వారు వెంటనే సాంకేతిక నిపుణులతో వచ్చి నేత్రాలను ఎలాంటి ఖర్చు లేకుండా తీసుకెళ్తారన్నారు. అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు రాజీవ్‌కుమార్, పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ దేశంలో 13మిలియన్ల మంది అంధత్వం బాధపడుతున్నారని, ఏటా 56 వేల నుంచి 86వేల మంది మాత్రం నేత్రదానం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సైదులు, విజయ్, భాస్కర్, నాయుడు పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

దేవరకొండ : ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని ఆలిండియా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్‌లు కోరారు. శనివారం దేవరకొండలో ఆ సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు చిట్యాల గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చైతన్యంతో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకోవాలని వారు సూచించారు. ఈ సమావేశంలో నాయకులు అందుగుల లక్ష్మీనారాయణ, కొండ్రపల్లి సురేష్, శిగ శ్రీనివాస్, జినుకుంట్ల రాఘవ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు

నాగార్జునసాగర్ : నందికొండ హిల్‌కాలనీలోని బీఆర్‌ఎస్ అభ్యర్థి భగత్ నివాసంలో మున్సిపాలిటీ నాయకుల ఆధ్వర్యంలో బూత్ కమిటీలను శనివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా భగత్ మాట్లాడుతూ నందికొండలో గంపగుత్తగా బీఆర్‌ఎస్‌కే ఓట్లు వేయించాలని ఆ కమిటీ సభ్యులును కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, సీనియర్ నాయకులు యడవెల్లి విజయేందర్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణఅనూషారెడ్డి, వైస్‌చైర్మన్ బిన్ని, రాష్ట్ర నాయకులు కర్ణబ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు



గంధం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లిలో గ్యార్మీ ఉత్సవాల్లో భాగంగా ముస్లింలు శనివారం గంధం ఊరేగింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వారి ఆచారాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొని ఒక్కరి ఒక్కరికి అభినందనలు తెలుపుకున్నారరు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండెబోయిన నగేష్ యాదవ్, ఖాదర్, షేక్ లేఖత్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దవూర : మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జైవీర్‌రెడ్డి పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, విజయారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి మాజీ జెడ్పీటీసీ



బీఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్

మిర్యాలగూడ : బీఎల్‌ఆర్ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మాజీ జెడ్పీటీసీ దోసపాటి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపుకు బీఎల్‌ఆర్ రాగా ఆయన సమక్షంలో దోసపాటి శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాదిల శ్రీనివాస్, అర్జున్, గాయం ఉపేందర్‌రెడ్డి, అంబి సోమయ్య, జలందర్‌రెడ్డి, ఆరిఫ్, మహేందర్‌రెడ్డి, రుణాల్‌రెడ్డి, మర్రి ఎలియాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన 50మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధనావత్ బాలనాయక్, వెంకట్రాంనాయక్, బద్దు నాయక్, బన్సిలాల్, బాషా, బిల్య ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

నకిరేకల్ : నిరంకుశ పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని అంతమొందించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జెఏసీ) స్టీరింగ్ కమిటీ మెంబర్ పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. ఆ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూపొందించిన ప్రచార కరపత్రాలను శనివారం నకిరేకల్‌లోఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు మందా రంజిత్ రావు,నిమ్మల రాఘవులు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో శాఖాపురం యువకులు

నిడమనూరు : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాకుండా.. వేరే ప్రాంతంలో నామినేషన్ వేశారు. గ్రామానికి చెందిన చేకూరి సందీప్, బారెడ్డి లక్ష్మారెడ్డి మిర్యాలగూడ అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేయగా.. అదే గ్రామానికి చెందిన బారెడ్డి మహేష్‌రెడ్డి పరిగి నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. గ్రామానికి చెందిన ముగ్గురు నామినేషన్ వేయడం చర్చనీయాంశంగా మారింది.

సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలి

డిండి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల విషయాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం అసెంబ్లీ ఎన్నికలో దేవరకొండ బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించలని కోరుతూ మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజీనేని వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ దేవేందర్ రావు, ఎంపీపీ సునీతా జనార్దన్‌రావు, సర్పంచ్ సాయమ్మ కాశన్న, ఎంపీటీసీ వెంకటయ్య బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బాలునాయక్

చందంపేట : మండలంలోని దేవరచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కేతావత్ హేమ్లానాయక్ తన అనుచరులతో శనివారం బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూన్సావత్ పార్వతీ, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ నేనావత్ బుజ్జి లచ్చిరాం, ఎంపీటీసీ కేతావత్ లక్ష్మణ్‌నాయక్, సుక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్‌ను కలిసిన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి



కాంగ్రెస్ నాయకులతో రాంరెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంపూర్ణ మద్దతు తెలపడంతో శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాంరెడ్డి, మిర్యాలగూడ కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్), కాంగ్రెస్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఎన్నికల్లో బీఎల్‌ఆర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీర్‌రెడ్డి, ఇంజం నర్సిరెడ్డి, పీసీసీ సభ్యులు కృష్ణయ్య, సీనియర్ నాయకులు పగిడి రామలింగయ్య, నాయకులు శ్రీనివాస్, సైదులు, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, జానీపాష తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభకు తరలిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు



హాలియా : మహాసభకు తరలి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కొండమల్లేపల్లి నుంచి తరలివెళ్తున్న ఎమ్మార్పీస్ శ్రేణులు

హాలియా : హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు అనుముల మండల వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నేతలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా అన్నీ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు హాలియా పట్టణానికి చేరుకొని ర్యాలీ నిర్వహించారు. తరలివెళ్లిన వారిలో ఎంఈఎఫ్ సంఘం మండల సీనియర్ నాయకులు సైదులురావు గౌతమ్, ఎమ్మార్పీఎస్ అనుముల మండల ఇన్‌చార్జ్ గడుసు సైదీష్, మాజీ మండల అధ్యక్షుడు విజయ్, వెంకన్న, సైదులు, చిన్న శేఖర్, అందుగుల రాజీవ్, విజయ్, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు కొండమల్లేపల్లి మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బయల్దేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ అందుగుల తిరుపతయ్య, విజయ్, మహేశ్, భగవంతు తదితరులున్నారు.

త్రిపురారం : మాదిగ ఉప కులాల ఏబీసీడి వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వరూప మహసభకు మండలంలోని పెద్ద దేవులపల్లి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగి క్రాంతి కుమార్, పుట్టల సైదులు, వెంకన్న, సైదులు,తరుణ్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మర్రిగూడ : మండలంలోని ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాంపల్లి సీఐ కె.నవీన్‌కుమార్ అన్నారు. శనివారం హిమాచల్‌ప్రదేశ్ ఐటీబీపీ ఫోర్స్ పోలీసులతో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన లెంకలపల్లి, శివన్నగూడ, కుదభాక్షపల్లి, మర్రిగూడ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.రంగారెడ్డి, సిబ్బంది వాహిద్, గణేష్, సైదులు, రమేష్, పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే ‘మద్దతు’

- ధాన్యం రంగు మారకముందే ఆరబెట్టుకొని ఐకేపీలకు తీసుకెళ్లాలి
- మట్టి, తాలు లేకుండా చూసుకోవాలి
- తేమ 17శాతం మించకూడదు



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుతున్న హార్వెస్టర్

పెద్దవూర : రైతులు పండించిన వరి ధాన్యంపై తీసుకునే జాగ్రత్తలతోనే మద్దతు ధర లభిస్తుంది. రైతులు పండించిన ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వం ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, మిగిలినవి వారంలోగా ప్రారంభం కానున్నాయి. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు. నార్లు పోసిన దగ్గర నుంచి పంట పండేవరకు పంటను కంటికి రెప్పలా కాపాడుకుని దిగుబడులు వచ్చే సమయంలో తగిన సూచనలు పాటించకుండా వరికోత కోయడం, నూర్పిడి పట్టడం, ఆరబోయకుండా ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లడం వంటి జాగ్రత్తలు పాటించకపోతే గిట్టుబాటు ధర రాక నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు వరికోతల సమయంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు

మట్టి, రాళ్లు, ఇసుక వంటివి లేకుండా చూడాలి గడ్డి, చెత్త తప్ప, కలుపు, విత్తనాలు ఒక్క శాతం మించకూడదు.

చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుపట్టిన ధాన్యంపు గింజలు 5శాతం మించకూడదు.

- వరిపక్వం గాని, ముడుచుకుపోయిన వంకర తిరిగిన ధాన్యపు గింజలు 3శాతంలోపే ఉండాలి.
- తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు ఏ గ్రేడ్ రకంలో 6శాతం మించకూడదు.
- తేమ శాతం 17శాతం మించితే కొనుగోలు చేయరు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యతో కలపకూడదు.
- పంట కోసిన తర్వాత ఆరబెట్టకపోతే గింజలు రంగుమారి నాణ్యత కోల్పోతాయి. పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి.
- నూర్పేటప్పుడు ధాన్యంలో రాళు, మట్టిగడ్డలు కలపకుండా నేల మీద పరదాలు లేదా టార్పలిన్లువేసి, వాటిపై నూర్పిడి చేయాలి.
- పంటలో తాలు, తప్ప, పొల్లు, చెత్తాచెదారం పోయేటట్లు తూర్పారపట్టాలి.
- ధాన్యం ముక్కిపోయి, రంగు మారి నాణ్యత పడిపోకుండా తేమ బాగా తగ్గాకే బస్తాల్లో నింపి లాటు కట్టాలి.
- నిల్వ ఉంచిన ధాన్యాన్ని ఎలుకలు నాశంన చేయకుండా బస్తాల మధ్యన జింకు సల్ఫేట్ మాత్రలు, పురుగు నివారణకు లీటర్ నీటికి 5మిల్లీ లీటర్ల మలాథియాన్ మందును బస్తాలపై పిచికారి చేయాలి.
- రైతులు ధాన్యపు పంటనుంచి కిలో ధాన్యం శాంపిల్ కింద కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష చేయించాలి. ధాన్యాన్ని పరీక్షించి ఆమోదం తెలిపితేనే కేంద్రానికి తీసుకురావాలి.
- మొదట తీసుకెళ్లిన శాంపిల్ మాదిరిగానే మిగతా ధాన్యం ఉండేలా చూసుకోవాలి.

గ్రేడును బట్టి ధర

వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి ప్రభుత్వం రూ.2203లు, సాధారణ రకానికి రూ.2183ల మద్దతు ధరను ప్రకటించింది. కనీస మద్దతు ధర దక్కాలంటే రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లటప్పుడు రైతులు ఆధార్ కార్డు జీరాక్స్, పండించిన భూమి పట్టాదారు పాసుబుక్ జీరాక్స్, రైతు బంధకు అనుసంధానమైన బ్యాంక్ ఖాతా జీరాక్స్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్ తీసుకెళ్లాలి.
- కౌలు రైతులు సైతం ఆధార్ కార్డు, బ్యాంక్ బుక్, కౌలు ఇచ్చిన రైతు పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్‌లతో పాటు ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, సంబంధిత వ్యవసాయ అధికారి జారీ చేసిన కౌలు సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుది.